> విధి చేతిలో మనిషి కీలుబొమ్మ అంటారు. మనిషి చేతిలో విధి కీలుబొమ్మ అయ్యేఅవకాశం ఉన్నా, ఆ అవకాశాన్ని చేజార్చుకుని, విధిపై నిందవేయడం పిరికివారికి అలవాటు. అవసరసమయంలో మనిషిని పిరికితనం ఆవహిస్తే, జీవితం పిచ్చిమాలోకమే అవుతుంది.

నిశాకన్య తనపని నిర్వర్తించి బద్ధకంగా ఒళ్ళు విరుచుకొంది. ప్రకృతి చలిలో వణికిపోతున్న సుందరిలా వుంది. ఆకాశంలో మేఘాలు దూదిపింజల్లా తేలుతున్నాయి. రాత్రి కురిసిన తేనెమంచు పచ్చిగడ్డి మీద తెల్లముత్యాల్లా మెరుస్తూ అందాన్ని విరజిమ్ముతూంది. గడ్డిచివుళ్ళు సిగ్గుతో ముకుళించుకొని ఆనందాన్ని ఆస్వాదిస్తున్నాయి.

కాలసర్పం పాపపుణ్యాలను మింగుతూ ముందుకు సాగిపోతున్నట్లు కొండలను చుట్టుకొని పాములా మెలికలు తిరిగివున్న రోడ్డును మింగుతూ బస్సు ముందుకు సాగిపోతూంది. ఒక పక్క ఎత్తైనకొండ, ఇంకొకవైపున అగాధమైన లోయ, స్వర్గనరకాల్లా నిల్చిఉన్నాయి. రాత్రి కురిసిన మంచుకు తార్కాణంగా కొండరాళ్ళు తడిగా కనిపిస్తున్నాయి. చల్లగాలి తివ్వన ముఖానికి కొడుతూంటే నరాలు జివ్వున లాగుతున్నట్లుంది. ఆ బాధలో అనిర్వచనీయమైన అనుభూతి! ఎంత ఆనందం! ఎంతసేపు చూచినా తనివితీరని కొండలోయలు. లోయల్లోకి తదేకంగా చూస్తూ ఉంటే పచ్చతనపు ముద్ద తప్ప ఇంకేమీ కానరావటంలేదు. దూరంగా లోయలకు ఆవలివైపున కొండలు! ప్రయాణించిన రోడ్డు అంతా మళ్ళీ కనిపిస్తూంది మనగ్గా! ఆ కొండ రోడ్డును మేఘాలు తాకుతూవుంటే 'వాటిలోంచే మనం ప్రయాణించి వచ్చామా?' అనిపిస్తూంది.

అనంతగిరి కనుమ దాటిపోయింది. అనంతగిరి ఆ ప్రాంతాలలోకి ఎత్తైన ప్రదేశం. అక్కడ నిలబడి ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తూ ఉంటే మనల్ని మనం మరిచిపోతాం. ఆనందం మనసులో ముద్ర వేసుకొంది. బస్సు అరకులోయను చేరువవు తూంది. బస్సుగమ్యానికి చేరువవుతున్నకొద్దీ ఆనందం పురి విప్పుకుంటూంది. జీవితంలో మొదటిసారిగా ఇటువంటి ప్రదేశాన్ని చూడటం! మనసు ఏవో లోకాల్లో ఆహ్లాదంగా విహరిస్తున్నట్లుంది.

"రాణీగారు మధుర స్వప్నాలు కంటున్నట్లుందే! ఆ స్వప్నాలలోని రాకుమారుడు, ఆ ప్రవరుడు, ఆ మన్మథుడు ఎవరో!" అంటూ జడ పట్టుకొని లాగింది శైలజ. స్నేహితురాండ్రందరూ గలగలా నవ్వారు. ఈ లోకంలో పడ్డాను.

"అబ్బ! ఉండవే! నువ్వు మరీను!" అంటూ జడ సవరించుకున్నాను.

"ఊహూ! చెబితేకాని వదలను! మేమందరం బస్సులో అరకులోయ పిక్నిక్‌కు బయలుదేరితే నువ్వు మాతో పాలు పంచుకోకుండా నీ ఊహానాథునితో విహరించటానికి ఈ శైలజ ఒప్పుకోదు!" మూతి అదోలా పెట్టింది శైలజ.

మళ్ళీ అందరూ నవ్వారు.

"ఛీ! పాడుపిల్లా!" అన్నాను సిగ్గుతో మెల్లిగా.

"ఏమిటాలోచిస్తున్నావ్ రాజీ!" అంది భుజం మీద చెయ్యి వేసి మెల్లిగా రాస్తూ.

"శైలూ! పాములా మెలికలు తిరిగిన ఈ అందమైన రోడ్డు, గిలిగింతలుపెట్టే ఈ చల్లనిగాలి, కన్నుల పండువగా పచ్చనిచీర ధరించిన ప్రకృతిసుందరి, ఆమెను ఆనందంతో పరామర్శిస్తున్న దూదిపింజల్లాటి తెల్లని మేఘాలు, ఇవన్నీ చూస్తుంటే నీకెలా ఉంది?" అన్నాను ఆనందంగా.

"అబ్బో! రాణీగారు కవిత్వంకూడా చెబుతున్నారే! సరేగాని ఈ ప్రకృతిని చూస్తే నా కెలాఉందో చెప్పనా?"

"ఊఁ! చెప్పు!"

"మరి నువ్వు ఏమీ అనుకోకూడదు. .!"

"ఊఁ! అలాగే!" అన్నాను సందేహిస్తూ.

"నిన్ను ముద్దు పెట్టుకోవాలని ఉంది." అంటూ వంగి బుగ్గమీద మెల్లిగా ముద్దు పెట్టుకొంది.

"ఛీ! పాడుబుద్ధులు!" అంటూ బుగ్గ తుడుచుకున్నాను. వెనుకసీటులోంచి మిగిలినవాళ్ళు నవ్వుతూంటే చచ్చేసిగ్గనిపించింది.

కేరింతలతో, గోలతో సాగిపోతూంది బస్సు.

"రాధిక ఏదీ?" అన్నాను ఏదో ఒకటి మాట్లాడాలని.

"అదిగో! ఆ ముందుసీటులో చూడు! ఎలా కూర్చుందో! అశోకవనంలో సీతలా! నా మీద అలిగి అక్కడికి వెళ్ళిపోయింది." అంటూ వెనకఉన్నపార్వతితో కబుర్లలోకి దిగిపోయింది.

శైలజ ఎల్లప్పుడూ వసపోసిన పిట్టలా ఏదో ఒకటి వాగుతూనే ఉంటుంది. ఆ వాగుడు భరించలేక ముందుసీట్లోకి వెళ్ళిపోయిఉంటుంది. ముందుసీటు వైపు చూశాను. నిశ్శబ్దంగా కూర్చొని బస్సులో నుండి ప్రకృతిని చూస్తూంది రాధిక. నిన్నటినుంచీ ఆమెను ప్రత్యేకంగా గమనిస్తున్నా! ఆమెలో ఏదో మార్పు, దిగులు కనుపిస్తున్నాయి. కొత్తప్రదేశానికి వెళుతున్నామన్న ఉత్సాహం ఆమెలో రవంతకూడా లేదు. ఏదో నిర్వేదంగా ఆలోచిస్తున్నట్లనిపించింది. ఆమె నిన్నటినుండి అలా ఎందుకు మారిపోయిందో అర్థం కాలేదు.

నేనూ, శైలజా ఇంటరునుండి కలిసే చదువుకున్నాం. మొదటినుండీ ఇద్దరం చాలా స్నేహంగా ఉండేవాళ్ళం. శైలజ వట్టి బోళామనిషి! ఎప్పుడూ ఏదో ఒకటి వాగుతూ, తుళ్ళుతూ ఉంటుంది. పైకిమాత్రం అల్లరిగా కనిపించినా ఆమెమనసు మాత్రం ఎంతో నిర్మలమైనది. ఆ విషయం తెలుసుకోవటానికికూడా నాకు ఎంతోకాలం పట్టలేదు. నాపై అభిమానం దాచుకోలేక అప్పుడప్పుడు అంటూ ఉండేది: "రాజీ! నువు నా దురదృష్టంకొద్దీ స్త్రీవై పుట్టావు. లేకపోతే నిన్నే పెళ్ళి చేసుకొనేదాన్ని!"

ఇద్దరం 'ఇంటరు' పూర్తిచేసి విశాఖపట్నంమెడికల్ కాలేజీలో చేరాం. అక్కడ హాస్టల్సులో మా రూమ్ మేటుగా మరొక ఆమె చేరింది. ఆమె రాధిక! రాధిక చాలా నిండైనమనిషి! అవసరమయితేతప్ప నోరువిప్పి మాట్లాడదు. ఎప్పుడూ గంభీరంగా, నిరాడంబరంగా ఉంటుంది. ఆమెలో ఆకర్షణ లేకపోయినా నిర్వచించలేని అందం ఉంది. ఆమె కాలేజీలో చేరిన కొత్తలో ఆమె ప్రవర్తనచూసి "మహాగర్విష్ఠి" అన్నారు. తరవాత "యోగిని" అన్నారు. ఎవరేమన్నా ఆమె చలించేదికాదు. ఆమెతో కాస్త చనువుగా మాట్లాడ గలిగినవాళ్ళం నేనూ, శైలజా మాత్రమే!

ఎవరెలా మాట్లాడినా నేను మాత్రం రాధికకు నా హృదయంలో ప్రత్యేక స్థానం ఇచ్చాను. అందుకు కారణం ఆమె మంచితనం, నిర్లిప్తత కావచ్చు! ఆమెముఖంలో సంతోషం, చిరునవ్వు చాలా తక్కువసార్లు చూశాను. "రాధికా, నువ్వు ఎక్కువగా మాట్లాడవు, కనీసం చిరునవ్వయినా నవ్వవు! ఏం? నవరత్నాలు రాలిపోతే మేము ఏరుకుంటామని భయపడుతున్నావా?" అని శైలజ అంటే చిన్నగా నవ్వుతుంది రాధిక. ఆ నవ్వులో నవరత్నాలు ఉండవు కాని నవరసాల్లో ఒక్కటయిన విషాదం మాత్రం మిణుకు మిణుకుమంటూ ద్యోతకమవుతుంది.

ప్రస్తుతం నాలుగో సంవత్సరం గడుస్తూంది. రాధిక, శైలజ ఇంకా ఇతర స్నేహితురాండ్రసాంగత్యంతో కాలం తెలియకుండా గడిచిపోతూంది. ప్రతి సంవత్సరం వలెనే ఈ ఏడాదికూడా హాస్టలుపిక్నిక్ ఏర్పాటు చేశారు. అందరి అభిప్రాయాలు సేకరించి అరకులోయ వెళ్ళటానికి నిశ్చయించారు. అచట దృశ్యాలను వర్ణించి చెబుతూంటే వినటమేగాని ఇంతవరకూ చూసే అదృష్టం కలగలేదు. బస్సులను ఏర్పాటు చేసుకొని ముందుగానే వంటసామగ్రి పంపించేశాం. తెల్లవారు ఝామునే మేంకూడా బయలుదేరాం.

"నువ్వు అలాగే ఆలోచనలో మునిగిపోయి కూర్చో! మేమందరం మళ్ళీ సాయంత్రంవచ్చి బస్సు ఎక్కుతాం. అప్పుడు మాతోకలిసి మళ్ళీ విశాఖ వచ్చేద్దువు గాని!" అంటూ శైలజ వీపు తట్టింది. అప్పుడు తెలిసింది బస్సు గమ్యం చేరిందని. బస్సులో అందరూ దిగేశారు. నా మతిమరుపుకు నాకే సిగ్గనిపించింది. నవ్వుకుంటూ దిగాను. అక్కడున్న ట్రావెలర్సు బంగళాలో మాకు బస ఇచ్చారు. లోపల అంతా కోలాహలంగా ఉంది. మైకులో పాటలతో, స్నేహితురాండ్రఅల్లరితో అదో పెళ్ళిఇల్లులా అనిపించింది. బంగళా అంతా ఒకమారు కలయ తిరిగాను. అది ఎత్తయినప్రదేశంలో ఉండటంవల్ల, చుట్టూఉన్న స్థలాలన్నీ చాలాదూరంవరకూ కనిపిస్తున్నాయి. మంచుతెరలు చాలావరకూ విడిపోయినా ఎండమాత్రం ఇంకా రాలేదు. బంగళావెనకభాగంలో అపుడే వంట ప్రయత్నాలు ఆరంభమయ్యాయి.

"ఒక్క పది నిమిషాలు రాజీ! టిఫిన్‌కాఫీ సిద్ధమయిపోతూంది" అంది కమల.

"ఓహో! ఇక్కడ తమరు ఆధ్వర్యం వహించారా? అయితే ఇక ఈ రోజా మేం భోజనాలు చేసినట్లే!" అంటూ నవ్వాను.

ద్విభాష్యం రాజేశ్వరరావు




ఆమెకూడా నాతోబాటు శ్రుతికలిపి నవ్వుతూ అంది "మాద్దువుగాని మన నాయకత్వం!"

"రాధిక ఏదీ?" అన్నాను.

"ఇప్పుడే తువ్వాలు తీసుకొని ఇటువైపు వెళ్ళింది" అంటూ ప్రక్కవైపున్న దారి చూపింది. నేను ధ్యానంగా అటువైపుకు వెళ్ళాను. కొంచెం దూరంలో వేపచెట్టు, దానికి ఆనుకొని పెద్ద రాతిబండ, బండ పక్కనే నిలబడి దూరాన కనుపించే దృశ్యాలవైపు చూస్తోంది రాధిక. అక్కడనుండి ఒకవైపు చూస్తుంటే డి. బి. కె. రైల్వేవారి ఆఫీసులు, గుడారాలు అన్నీ కలిసి పట్టణంలా కనుపిస్తూంది. ఇంకొకవైపున మేం వచ్చినదారి, దారిపక్కనచిన్న పాక హోటళ్ళు, కిళ్ళీషాపులు, కూరలబజారు దూరంగా కనిపిస్తున్నాయి.

ఎత్తయిన స్థలం కావటంవల్ల గాలి రివ్వున వీస్తూంది. గాలికి రాధిక జుట్టంతా రేగి ఆమెముఖంపై పడుతూంది. వీటన్నిటినీ లెక్కచెయ్యకుండా మరో ప్రపంచంలో ఉన్నట్టు, ధ్యానవదనంతో ఎటో వీక్షిస్తున్న రాధికను చూస్తుంటే ఆదోలా అనిపించింది.

"ఏం రాధికా ఇక్కడ నిలబడ్డావ్?"




"అబ్బే! ఏంలేదు. . ." అంటూ తత్తరపాటుతో నా వైపు తిరిగింది.

ఆమె ముఖమంతా పాలిపోయింది. కనుకొలకుల్లో కెంపుల్లాంటి బిందువులు అస్పష్టంగా జీరాడుతున్నాయి. ఆమె ముఖంలోకి చూస్తుంటే ఏదో బాధ పడుతూందని తెలుసుకోవటానికి ఎంతోసేపు పట్టలేదు. నా అనుమానం పసిగట్టింది కాబోలు, తువ్వాలుతో కనులు ఒత్తుకొని, తెచ్చిపెట్టుకున్న పాలిపోయిన చిరునవ్వును పెదాలపై పులుముకొంది.

"రాధికా! ఏమిటాలోచిస్తున్నావ్?" గోముగా అడిగాను.

"అబ్బే ఏం. . లేదు! స్నానం ఎక్కడ చేద్దామా? అని. . అంతే!" అంది గాభరాగా.

"ఎందుకు రాధీ! అలా తడబడతావు! నువ్వు ఏదో బాధపడుతున్నావని నాకు తెలుసు. లేనినవ్వు తెచ్చుకొని దాన్ని దాచేద్దామని ప్రయత్నిస్తున్నావు. నాతో చెప్పకూడదూ! అంత కానిదాన్ని అయ్యానా నేను."

"క్షమించు రాజీ! అంత మాటనకు. . పద! వెళ్ళి టిఫిన్ చేద్దాం!" అంటూ మాటలు మార్చి ముందుకు దారితీసింది. మౌనంగా అనుసరించాను.

నెమ్మదిగా టిఫిన్, కాఫీలు పూర్తిచేశాం.

బట్టలు మార్చుకొని బయటకు బయలుదేరటానికి సిద్ధమయ్యాం.

నలుగురయిదుగురు ఒక గుంపుగా చిలి ఇష్టం వచ్చిన చోటుకు బయలుదేరి వెళుతున్నారు.

[illegible] పట్టుకొని వచ్చింది.

"రాణిగారూ! మేం ముగ్గురం ఆర్చిడాస్ (ఫలపరిశోధక కేంద్రం) చూడటానికి వెళుతున్నాం. మీరుకూడా వస్తారా?" అంటూ నా వైపు, రాధికవైపూ చూసింది.

"అబ్బో! అపుడే ఇక్కడ ఏమేమిటివున్నాయో కనిపెట్టేశావే? కొలంబస్, మార్కోపోలో నీ వర్సనే ప్రఖ్యాతిపొంది ఉంటాడు క్రితం జన్మలో" అన్నాను నవ్వుతూ. "ఏం రాధీ! వెళదామా?"

"నేను చూశాను క్రితంసారి వచ్చినప్పుడు" ముక్తసరిగా అంది.

"ఇంతకుముందు ఎప్పుడైనా వచ్చావా?"

"ఊ! మెడిసన్‌లో చేరేముందు వచ్చాను."

"అరె! చెప్పవేం? మాకు మార్గదర్శకురాలవన్న మాట! దారి చూపించటానికి సహాయపడుదువుగానిరా!" అంటూ శైలు బలవంతం చేసింది.

"సరే!" అని మౌనంగా బయలుదేరింది రాధిక.

అయిదుగురం కలిసి మెల్లిగా నడక ప్రారంభించాం. బంగళానుండి రోడ్డుకు చేరుకున్నాం. రోడ్డుమీద కమలాఫలాలు కొని ఒలుస్తూ నడక సాగించాం. రాత్రి మంచుకురవటంవల్ల కమలాఫలాలు చల్లగా ఉన్నాయి. తొనలు తింటూంటే పళ్ళు లాగుతున్నాయి. శైలు చెప్పే కబుర్లు వింటూ, మధ్యమధ్యలో చలోక్తులు విసురుకొంటూ నడుస్తున్నాం.

రాధిక నిర్లిప్తతచూస్తే ఆశ్చర్యం కలిగింది. తాను ఇక్కడకు ఒకసారి వచ్చినట్లు మేం అడిగేవరకూ చెప్పనేలేదు. ఇదే శైలజ అయితే, మేం చూడనవసరం లేకుండా అన్నీ వివరించి కళ్ళకు కట్టినట్లు చెప్పి ఉండేది. ఇద్దరికీ ఎంత తేడా!

'ఆర్చిడాస్' చేరుకున్నాం. అప్పటికే మా స్నేహితులు కొందరు తోటల్లో తిరుగుతున్నారు. ఇద్దరు లంబాడీ వనితలు మొక్కలకు కలుపు తీస్తున్నారు. లోపల ప్రవేశించి స్వేచ్ఛగా తిరిగాం. అన్నిరకాల మొక్కలను మళ్ళీ చూడగలమా అనిపించింది. ప్రభుత్వం ఇక్కడ తీసుకుంటున్న శ్రద్ధ గమనిస్తే చాలా ఆనందం కలిగింది. ఏజాతి కాజాతి మొక్కలను విడిగా పెంచుతున్నారు, నిమ్మ, బత్తాయి మున్నగు చెట్లు ఒకవైపు, లవంగాలు మొదలైనవి ఇంకొకవైపు విడివిడిగా పెంచుతున్నారు. కొంత ఎత్తయిన ప్రదేశపువాలులో [illegible]చెట్లక్రింద కాఫీతోటలు బాగా పెరుగుతున్నాయి. ఇవికాక రకరకాల పూలమొక్కలు. గులాబీలు ఆరోగ్యం బొద్దుగా, పెరిగి, మంచుతో తడసి, అరచేతి ప్రమాణాలలో చూడటానికి ఎంతో అందంగా ఉన్నాయి.

"చూశావా శైలూ! ప్రకృతిలో పెరిగిన ఈ గులాబీలు ఎంత అందంగా ఉన్నాయో! మన పెరట్లో పెరిగినవి ఇందులో మూడో వంతుకూడా ఉండవు పరిమాణంలో" అన్నాను.

ముద్దగా ఉన్న తెల్లగులాబీ రాత్రిపడిన వెన్నెలలాటి మంచుతో వింతగా ప్రకాశిస్తూంది.

"ఇంకేం! ప్రకృతిపరీక్ష కూడాచేస్తున్నావన్నమాట!" అంటూ నవ్వింది శైలజ.

తలోక పువ్వు కోసి పట్టుకొని బయలుదేరాం.

"ఆర్చిడాస్" అంతా పూర్తిగా తిరిగి బయటకు వచ్చాం.

"ఇంకా ముందుకు వెళ్ళి తిరిగివద్దామా?" అన్నాను.

"కమల నా కోసం చూస్తూ ఉంటుంది. మీరు వెళ్ళండి" అంది శైలజ.

నేనూ, రాధికా ముందుకు బయలుదేరాం. వాళ్ళు ముగ్గురూ బంగళాకు వెళ్ళిపోయారు. వెళ్ళిపోతూ అంది శైలజ: "ఇద్దరూ ప్రకృతి ఆరాధకులే, సాయంత్రానికి తిరిగి వచ్చెయ్యండి ఒళ్ళు మర్చిపోక" ఆ మాటలు జ్ఞప్తికివచ్చి చిన్నగా నవ్వుకుంటూ నడుస్తున్నాను.

ఉదయంనుండీ నన్ను పట్టుకొని పీడిస్తున్న సందేహం తీర్చుకోవటానికి అవకాశం లభించింది.

"రాధికా! ఉదయంనుండీ ముభావంగా ఉన్నావేం?"

"రాజీ! ఈ ప్రదేశాలు పాతజ్ఞాపకాలను నెమరుకు తెస్తూంది. పాతబాధలను త్రవ్విపోస్తూంది."

నాకు ఆశ్చర్యం కల్గింది. ఏమిటో అంత బాధలు! రాధిక ఎంత నిండుగా ఉంటుంది!

ఇద్దరం కొంతదూరం మౌనంగా నడిచి సర్వేచెట్ల నీడలో కూర్చున్నాం.

రాధిక దీర్ఘంగా నిట్టూర్చి చెప్పటం ప్రారంభించింది.

* * *

"రాజీ, నేను చిన్నతనంనుండి బాధలు, అశాంతి మొదలైన పదాలకు అర్థం తెలియకుండా పెరిగాను. నేను ఒక్కతెనే అవటంవల్ల అమ్మ, నాన్న నన్ను ఎంతో గారాబంగా పెంచారు. నాన్నగారు వ్యాపారంలో లక్షలార్జించారు. నే నొక్కగానొక్క కూతుర్ని. ఇంట్లో, ఏ పని జరిగినా నా ఇష్టానిష్టాలపై ఆధారపడి జరిగేవి. అలాగే, మితిమీరిన సుఖాలమధ్య జీవితం గురించి పరిస్థితులగురించి ఆలోచించటానికి అవసరం కలగని సంతోషాలమధ్య వేడుకలమధ్య గడిచిపోయింది నా బాల్యం!

నాకు పూర్తిగా జ్ఞానం రాకముందే మా కుటుంబం ఏలూరులో స్థిరపడిపోయింది. నాకు చదువు చెప్పించటానికి స్కూలుకు పంపించకుండా ఇంటికి టీచర్ని రప్పించి చదువు నేర్పించారు. నా మెట్రిక్ వరకూ అలాగే జరిగిపోయింది. తరవాత ఏలూరులో కాలేజీలో ఇంటరులో చేరాను. అప్పటికి నాకు పదహారేళ్ళ వయసు ఉంటుందేమో! ఇంటరు మొదటి సంవత్సరం గడిచిపోయింది. పరీక్షలు బాగానే వ్రాశాను. సెలవులు ఇచ్చేశారు. ఆ వేసవిలో ఎండలు చాలా ఎక్కువగా ఉండటంవల్ల కొన్నిదినాలు అరకులోయ మొదలైన

ప్రదేశాలన్నీ తిరిగి వద్దామని నాన్నగారు నిశ్చయించారు. అందమైన ప్రకృతిలో గడపటమంటే నాకుకూడా చాలా ఇష్టం! మేం ముగ్గురం కాక ఒక వంటమనిషితో మా కారులో బయలుదేరాం.

అప్పటికి ఇంకా ఈ ప్రదేశం అభివృద్ధి కాలేదు. రోడ్లు, బంగళాలు ఇవేమీ లేవు. మనం వచ్చిన కొండదారికూడా అంతంత మాత్రంగా ఉండేది. ఈ రైల్వేఆఫీసులు, పట్టుపరిశోధకకేంద్రం, ఫలపరిశోధక కేంద్రం మున్నగునవి అన్నీ ఏర్పాటుచేశాక బాగా పెరిగిపోయింది. ఇక్కడ నివసించే కొండజాతులుకూడా ఇప్పుడు బాగా నాగరికత నేర్చుకున్నారు.

ప్రత్యేకంగా చూడటానికి ఏమీ లేకపోయినా ప్రకృతిలోనే కాలం తెలియకుండా గడిచిపోయేది. వచ్చిన మొదటి వారంలో మాచ్‌ఖండ్ వెళ్ళి జలపాతం చూసివచ్చాం. ఇక్కడకు వచ్చిన పదో రోజున అనుకుంటాను, సాయంత్రం ఎండ తగ్గాక బుచ్చిబాబు 'దేశం నా కిచ్చిన సందేశం' పుస్తకం పట్టుకొని బయలు దేరాను. రోడ్డు ప్రక్కఉండే చెట్లను చూస్తూ, వింతకంఠాలతో గానంచేసే పక్షులపిలుపులు వింటూ ప్రకృతిలో మైమరిచి చాలా దూరం నడిచివెళ్ళి, కొంతదూరంలో సన్నగానీరుపారుతున్నధ్వని వినిపించింది. దూరంగా చిన్నసెలయేరు! దానికి దగ్గరలో చెట్టుకింద ఎవరో వ్యక్తి కూర్చొనిఉన్నాడు. మెల్లిగా నడుస్తూ దగ్గరగా వెళ్ళాను. అతడు తదేకంగా సెలయేటి ఆవలివైపు దృశ్యాన్నిచూస్తూ ఒక తైలవర్ణచిత్రాన్ని గీస్తున్నాడు. పక్కనే రంగులపెట్టె, రెండు కుంచెలు ఉన్నాయి. ఒత్తుగా ఎదిగిన నొక్కులజుట్టు గాలికి రేగిపోయి అస్తవ్యస్తంగా ఉంది. అతని ధ్యాస అంతా అతడు చిత్రించే చిత్రంమీదే ఉందని తెలుసుకోటానికి ఎంతోసేపు పట్టలేదు.


బయట ప్రపంచంతో తనకు సంబంధం లేనట్లు చిత్రణలో మునిగిపోయి ఉన్నాడు. ధైర్యంచేసి మెల్లిగా అడుగులు వేస్తూ దగ్గరగా వెళ్ళాను. వెనకనుండి చిత్రం స్పష్టంగా కనుపిస్తూంది. ఎదురుగా కంటికి కనుపించే సెలయేరు, దూరానఉన్న కొండలు అందులో ప్రాణం పోసుకుంటున్నాయి. చిత్రణ అద్భుతంగా ఉంది. ప్రకృతిఆచిత్రంలో నిండుగా ప్రతిబింబిస్తూంది. ఏమీతోచక, నాసామీప్యాన్ని సూచిస్తూ పొడిగా దగ్గాను. అతడు వెనక్కి తిరిగిచూసి గాబరాపడుతూ లేచి నిలబడ్డాడు. అతని గాబరాచూస్తే కొంచెం నవ్వు, సిగ్గు కలిగాయి. నా వైపు తదేకంగా చూస్తూ "మీరు. . . ." అన్నాడు సందేహిస్తూ.

"సారీ! మీ ఏకాంతాన్ని పాడుచేసినట్లున్నాను. మీరు గీస్తున్న చిత్రం అద్భుతంగా ఉంది. మీ పేరు?" నా ధైర్యానికి నాకే ఆశ్చర్యం కల్గింది.

"నా పేరు శేఖర్. . ఇక్కడే పోస్టాఫీసులో పనిచేస్తున్నాను. అలా కూర్చోండి!" ఇంకా అతనిలో తడబాటు తగ్గలేదు. అతడుచేసే మర్యాదలకు నవ్వు వచ్చింది.

కొద్దిదూరంలో ఇసుకపై చతికిలబడుతూ అన్నాను: "ఓహో! తరుచుగా పత్రికలలో శేఖర్ అనే పేరుతో చిత్రాలు ప్రచురింపబడుతూ ఉంటాయి. అవి మీరు గీసినవేనా?"

"అవునండీ!" అన్నాడు తల వంచుకొని.



జవ్వనుల జంట

చిత్రం — కనుపర్తి గోపాలకృష్ణమూర్తి (బాపట్ల)

"క్రితంసారి ఏదో పత్రిక నిర్వహించినపోటీలో మీకు బహుమతికూడా వచ్చిందనుకుంటాను"

"ఆ! ఏదోలెండి!" మెల్లిగా నసుగుతూ అన్నాడు.

"మిమ్మల్ని కలుసుకున్నందుకు చాలా ఆనందంగా ఉంది" అన్నాను. ఆ మాటలు అంటూంటే అతను నా వైపు చూసినచూపులో ఏదో ఆనందకిరణం తళుక్కుమని మెరిసింది. ఆ చూపు తట్టుకోలేక సిగ్గుతో తల వంచుకున్నాను.

"ఇంతకీ మీరు నా గురించి తెలుసుకున్నారుకాని, మీ గురించి ఒక్క మాటయినా చెప్పలేదు!" అన్నాడు నవ్వుతూ.

"నా గురించి ప్రత్యేకం తెలుసుకోవలసినది ఏమీ లేదులెండి!" అంటూ అరకులోయవచ్చిన సంగతి చెప్పాను.

ఆ విధంగా జరిగింది మా మొదటి పరిచయం. అతని చిత్రాలంటే అతన్ని చూడకముందునుంచీ చాలా ఇష్టంగా ఉండేది. అతనితో పరిచయం లభించాక ఆ గౌరవం మరీ పెరిగింది.

కాంతిగాఉండేముఖం, చిన్ననోరు, నొక్కులజుట్టు, మిలమిల మెరిసేకళ్ళు, ఏమైనా ఒక్క మాటలో చెప్పాలంటే శేఖర్ చాలా అందమైన వ్యక్తి. మనిషి మధ్య తరగతిలో జన్మించినా మంచి సంస్కారంగల వ్యక్తి. నేను అక్కడ గడిపిన ఇరవై రోజులలోను అతనితో బాగా స్నేహం కలిసింది. అతనివద్దనుండి శరత్ సాహిత్యం అంతా పట్టుకొనివచ్చి చదివి కాలం గడిపాను. అతనిస్నేహంలో ఇరవై రోజులూ, ఇరవై గంటల్లా గడిచిపోయాయి. అతని మాటలలోని మృదుత్వం, చూపుల్లోని లాలిత్యం నన్ను గిలిగింతలు పెట్టేవి. ఆ కొద్దిరోజుల సాహచర్యంలో, పూర్తిగా అతనికి వివశురాలనయిపోయాను. మా ఇద్దరి మధ్యా ఎన్నో మధురభావాలు దోబూచులాడాయి. అతన్ని విడిచి ఏలూరు తిరిగి వచ్చేటప్పుడు చెప్పలేని బాధ కలిగింది. ఏదో అమృతంలాంటి వస్తువు దూరమయి పోతున్నట్లనిపించింది. శేఖర్‌కూడా మనసులో బాధను అణచిపెట్టుకొని, తెచ్చిపెట్టుకున్న సంతోషంతో వీడ్కోలు ఇచ్చాడు.

ఏలూరు చేరుకున్నాను. మళ్ళీ కాలేజీలు, చదువులు! వారం రోజులవరకూ మామూలు మనిషిని కాలేక పోయాను. నిరంతం శేఖరంతో గడిపిన క్షణాలు నెమరుకు తెచ్చుకొని, అతన్ని గురించి కలలు కంటూ కాలం గడిపేదాన్ని.

శేఖరం తరుచుగా ఉత్తరాలు వ్రాస్తూండేవాడు. వాటికి సమాధానాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయటానికి అంతరాత్మ ఒప్పుకునేది కాదు. జవాబులు వ్రాసేదాన్ని. తరవాత ఇంటరుపరీక్షలు వ్రాసిన సెలవులకు జీవితంలో పెద్ద మలుపు తిరిగింది. అదే నా వివాహం.!

నాన్నగారితో శేఖరాన్ని గూర్చి చెబుదామనుకునే దాన్ని. కాని ధైర్యం చాలకపోయింది. నా పిరికితనమే నన్ను సరిగా బ్రతకనివ్వకుండా చేసింది. నా పెళ్ళి శుభలేఖ శేఖరానికి కూడా పంపించాను. కాని దాని పరిణామాన్ని ఊహించలేకపోయాను. అతని వద్దనుండి ఉత్తరాలు రావటం ఆగిపోయాయి. అతన్ని గురించిన జ్ఞాపకాలు మరిచిపోవటానికి ఇది ఒక విధంగా ఉపకరిస్తుందని అనుకుని ఊరుకొన్నాను. మనసు రాయి చేసుకొని కాలం గడిపాను.

నా వివాహమయ్యాక పదినెలలు గడిచాయి. ఆయన ప్రేమలో కాలక్రమేణా శేఖరాన్ని మరిచిపో గలిగాను. కాని నేను ఆ విధంగా శాంతిని పొందటం, సుఖపడటం విధాత చూడలేకపోయాడు! విధి ఎదురు తిరిగింది! నందనవనంలాటి నా బ్రతుకును రుద్రభూమిగా మార్చింది. ట్రాంబేలో ఇంజనీరుగా పనిచేస్తున్న ఆయన హఠాత్తుగా కారుప్రమాదంలో మరణించారు! నా జీవితం అంధకారమయింది!

నా పరిస్థితిని చూసిన నాన్నగారు మతిచలించి నట్లయింది. ఆయనకు ఉన్నఆస్తి, అంతస్తులు ఆయనకు మనశ్శాంతిని ఇవ్వలేకపోయాయి. నిరంతరం నా గురించే ఆయనకు బెంగ పట్టుకుంది. ఇంటివద్ద రెండేళ్ళు నిర్లిప్తంగా కాలం గడిపాను. ఖాళీగా, ఒంటరిగా ఉండటంవలన గతజీవితాన్ని గురించిన జ్ఞాపకాలు మనసును బాధించేవి. రాత్రి నిద్రలో మెళకువవస్తే మళ్ళీ నిద్ర పట్టేదికాదు. తెల్లవారేవరకూ దుఃఖిస్తూ కాలం గడిపేదాన్ని. నా స్థితిచూసి నాన్నగారు నన్ను మెడిసన్‌కోర్సులో చేర్పించారు. కనీసం చదువులో మునిగి నా బాధలను మరిచిపోతానని. యాంత్రికజీవితంఅలవాటయిపోయింది. నా మనసుకే తెలియని మొండిధైర్యంతో, విశ్వాసంతో బ్రతుకుతున్నాను. కాని ఇప్పటికీ మనసును కలచివేసే బాధ ఒక్కటే! నా జీవితం ఎలాగో ఎడారి ప్రాయమయింది. నన్ను నమ్ముకొని, నా పైనే ఆశలు పెంచుకున్న శేఖరానికి తీరని అన్యాయం చేశాను. అతని జీవితాన్ని నరకం గావించాను. సుఖశాంతులతో ఉన్న నిర్మలమైన అతని జీవితవనంలో నా పాదం పెట్టి నరకప్రాయం గావించాను.

నేను మెడిసన్‌లో చేరేముందు మామయ్యతో కలిసి ఈ అరకులోయకు వచ్చాను. అప్పుడు శేఖరం గురించి ఆరాతియ్యకుండా ఉండలేకపోయాను. కాని, పరిస్థితులు చేయిదాటిపోయాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకన్నట్టు అయింది. కనీసం నన్ను గుర్తుపట్టే స్థితినిగూడా ఏ నాడో కోల్పోయాడు శేఖరం! మతి భ్రమించి, పిచ్చివాడయి ఈ లోయలలోనే తిరుగుతున్నాడు. పండంటిఅతని జీవితాన్ని నా శవం గావించిన పాపం నాది! దీనికి నిష్కృతిలేదు" రాధిక కథ ముగించింది!

ఆమెకంటినుండి ఎంత దాచుకున్నా ఆగని నీళ్ళు చిప్పిల్లాయి! నాకుకూడా మనసు ఆర్ద్రతతో చలించిన మాట వాస్తవం.

'రాధిక! ఎంత దావాగ్నిని తనలో దాచుకొంది! ఎన్ని మథనాలను ఎదుర్కొంది!' ఆమె నిర్లిప్తతకు ఈ సంఘటనలే కారణాలన్నమాట!

ఆమెను ఓదార్చటానికి మాటలు వెతుక్కోవలసి వస్తూంది.

"రాధికా! నీ గతాన్ని తవ్వి మనసు నొప్పించాను. నన్ను క్షమించు!" నేలమీద పిచ్చిగా గీస్తూ అన్నాను.


"నువ్వు చాలా పొరపాటు చేశావు రాధీ! ఆనాడే ధైర్యంగా శేఖరాన్ని వివాహం చేసుకొనిఉంటే ఇన్ని బాధలు కలిగేవి కావేమో! అయినా విధిబలీయం! గతానికి తెరవేసి భవిష్యత్తులో ఆశలసౌధం నిర్మించుకొని అందులో బ్రతకటమే జీవితానికి నిండుతనాన్ని సంతృప్తిని కలిగిస్తుంది."

మాటలు పూర్తిచేసి దీర్ఘంగా నిట్టూర్చాను. లేతగా ఎండ వస్తూంది. సమయము పదకొండు కావస్తూంది.

"ఇక లేచి వెళదాం రాధీ! శైలజ మనకోసం ఎదురుచూస్తూ ఉంటుంది!" అంటూ లేచింది రాధిక. మౌనంగ అనుసరించాను. బంగళావద్దకు చేరుకున్నాం. వెనకవైపు నూతివద్ద కోలాహలంగా ఉంది. ఆత్రంగా అటువైపు వెళ్ళాం. నూతివద్ద గుంపులోనుండి శైలజ బయటకు వస్తూ అంది "పాపం! ఎవరో పిచ్చివాడు! నూతిలోపడి చచ్చిపోయాడు!"

రాధిక కంగారుగా గుంపు తోసుకుంటూ మధ్యకు వెళ్ళి అచటి దృశ్యంచూసి కెవ్వున కేకవేసి స్పృహతప్పి పడిపోయింది.

భగవంతునిలీలలు విచిత్రంగా ఉంటాయి. రాధిక వంటి సుగుణాలరాశిని, అందాలబొమ్మను సృష్టించి, ప్రాణంపోసి ఇంత దారుణంగా ఎందుకు హింసిస్తాడో తెలియదు. దానిలోనే ఆయనకు ఆనందం లభ్యమవుతుందేమో మరి! ఆ నాడు ఆ భయానక దృశ్యంచూసి స్పృహతప్పి పడిపోయి, మతిని పోగొట్టుకున్న రాధిక ఈ నాటికీ అలాగే ఉంది. జుట్టు విరియబోసుకొని, కిటికీఊచలు పట్టుకొని శూన్యంలోకి చూస్తూ అస్పత్రిలో కాలం దొర్లిస్తున్న రాధికను చూస్తూంటే మనసు చితిలో దహించుకుపోతున్నట్లు ఉంటుంది! ★




చిత్రం—కాటూరి కృష్ణమూర్తి (మూకట్ల)